అట్టహాసంగా గంగజాతర


ఆలయం ఎదుట పూజలు చేస్తున్న మహిళలు

మదనపల్లె సిటీ: మదనపల్లె పట్టణంలో మంగళవారం కోర్టులో గంగమ్మజాతర అట్టహాసంగా ప్రారంభమైంది. ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. పలు రకాల పుష్పాలతో అందంగా తీర్చిదిద్దారు. మహిళలు అమ్మవారికి నైవేద్యంగా పిండి వంటలు సమర్పించారు. నిమ్మకాయలతో దీపాలు వెలిగించారు. అమ్మవారికి చీర,రవికెలు సమర్పించారు. గంగమ్మతల్లీ ..కరుణించమ్మా అంటూ ప్రణమిల్లారు. పాడిపంటలతో వర్ధిల్లేలా దీవించాలని ప్రార్థించారు. స్థానిక అమిమినేనివీధి, రాటకొండవీధిలోని గంగమ్మలకు ప్రత్యేక అలంకరణలు చేశారు. ఎన్టీఆర్ సర్కిల్, సొసైటీకాలనీ, అమినేనివీధి, కజిన్స్‌రోడ్డు, రాటకొండవీధి, బెంగళూరులలో అమ్మవారి విద్యుత్ కొటౌట్లు ఏర్పాటు చేశారు. కోర్టు ఆవరణం భక్తులతో కిటకిటలాడింది. రాటకొండ బాబురెడ్డి కుటుంబీకుల నుంచి కల్లు కుండను ఊరేగింపు అమ్మవారి ఆలయం వద్దకు చేర్చారు. తొలిపూజను జోశెపాళెం కుటుంబీకులు అమ్మవారికి నిర్వహించారు.

వివిధ వేషధారణలు

జాతర పురస్కరించుకుని గంగమ్మ తల్లి, రాక్షసుడు, పలు దేవతల వేషధారణలు ఆకట్టుకుంది. వేషదారులు అమ్మవారి ఆలయం ఎదుట విన్యాసాలు ప్రదర్శించారు. అమ్మవారికి మొక్కులు చెల్లించారు.

నేడు అమ్మవారి విశ్వరూప దర్శనం

జాతర పురస్కరించుకుని బుధవారం తెల్లవారుజామున అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ చేయనున్నారు. నిజరూప దర్శనంతో అమ్మవారిని దర్శించుకోనున్నారు. పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ మార్పురి చిన్నరెడ్డప్ప, ఉపాధ్యక్షులు వేణుగోపాల్,కార్యదర్శి ప్రభాకర్‌నాయుడు, కోశాధికారి రంగస్వామి, కరుణాకర్ భవానీప్రసాద్, శశిధర్‌రావు,ప్రభాకర్, మహేష్ తదితరులు జాతరను పర్యవేక్షించారు.

ప్రతి ఒక్కరికీ ఆప్యాయతతో పలకరింపు

మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డికి ఘన స్వాగతం


శ్రీసప్పాలమ్మ ఆలయంలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మిథున్‌రెడ్డి పూజలు

మదనపల్లె/బి.కొత్తకోట: అన్నా బాగున్నారా, ఎలా ఉన్నారు అన్నా అంటూ రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి వైఎస్సార్‌సీపీ నాయకులను ఆప్యాయంగా పలుకరించారు. మంగళవారం ములకలచెరువు, మదనపల్లె మండలాల్లో పర్యటించిన సందర్భంగా ప్రతిఒక్కరిని సొంత మనిషిలా పలుకరిస్తూ యోగక్షేమాలను తెలుసుకున్నారు. ములకలచెరువు సమీపంలోని ఓ కళ్యాణ మండపంలో జరిగిన వివాహ వేడుకకు మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా బురకాయలకోటలో సర్పంచు వై.విజయమ్మ ఇంటికి రాగా ఘనస్వాగతం పలికారు. అక్కడే బి.కొత్తకోట, ములకలచెరువు, పెద్దతిప్పసముద్రం మండలాలకు చెందిన నాయకులను పలుకరించారు. అందర్ని పలుకరిస్తూ కుటుంబ పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమం విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులను సూచించారు. ఈ నిరసన కార్యక్రమం ద్వారా కూటమి ప్రభుత్వానికి ప్రజల్లో ఏ స్థాయిలో వ్యతిరేకత ఉందో స్పష్టం కావాలని కోరారు. అనంతరం బురకాయలకోట మదనపల్లె రూరల్ మండల సీటీఎం క్రాస్‌కు చేరుకున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మిథున్‌రెడ్డిలకు స్థానిక సర్పంచు బండపల్లి ఈశ్వరమ్మ, అభివృద్ధి కమిటీ చైర్మన్ బండపల్లి వెంకటరమణ ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు. ఇక్కడి శ్రీ సప్పాలమ్మ ఆలయంలో పూజలు నిర్వహించేందుకు రాగా అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలో ఇరువురికి అర్చకులు ఆశీర్వచనంతో తీర్థప్రసాదాలను అందించారు. కార్యక్రమాల్లో మదనపల్లె సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్, మున్సిపల్ చైర్‌పర్సన్ వి.మనూజరెడ్డి, పోతబోలు నాగరాజు, వెంకటప్ప, జాకీర్, హనుమంతురెడ్డి, మహబూబ్‌బాషా, ఈశ్వర్, బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు ఉజ్జయిని సాంబశివ, రవిశేఖర్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, మంజు, బద్రి ప్రతాప్, మాజీ డైరెక్టర్ వలసపల్లె రవి, కిషోర్, రెడ్డిహరి పాల్గొన్నారు.

డీసీసీబీ బ్యాంకులో ఏటీఎం, యూపీఐ సేవలు


మాట్లాడుతున్న సహకార కేంద్ర బ్యాంకు సిబ్బంది

మదనపల్లె రూరల్ : పట్టణంలోని ది చిత్తూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో ఏటీఎం, యూపీఐ(ఫోన్ పే) తదితర సేవలు ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు అసిస్టెంట్ మేనేజర్ శ్రీనివాసులు తెలిపారు. బ్యాంకులో మంగళవారం సాయంత్రం వినియోగదారుల సమావేశం నిర్వహించారు. బ్యాంక్ డిపాజిట్లు, రైతులకు ఇస్తున్న రుణాలు, వినియోగదారుల సాధకబాధలపై చర్చించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ మేనేజర్ శ్రీనివాసులు మాట్లాడుతూ...డీసీసీబీ బ్యాంకులో అతి తక్కువ వడ్డీ రేట్లకు, కమర్షియల్ బ్యాంకులకు దీటుగా హౌస్ మార్టిగేజ్ లోన్స్, హౌస్‌లోన్స్, గోల్డ్, అగ్రికల్చరల్ గోల్డ్ లోన్స్ అందిస్తున్నామన్నారు. మదనపల్లె బ్రాంచీలో రూ.50కోట్ల వరకు డిపాజిట్లు ఉన్నాయని, జిల్లా వ్యాప్తంగా కేంద్ర సహకార బ్యాంకు 950 కోట్లు డిపాజిట్లు కలిగి ఉందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లా వ్యాప్తంగా 1,100 కోట్లు డిపాజిట్లు సేకరణ లక్ష్యంగా ముందుకెళుతున్నామన్నారు. డీసీసీబీ బ్యాంకు ఖాతాదారులకు రూ.5లక్షల వరకు ప్రమాద బీమా ఇస్తున్నామన్నారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో చేసే డిపాజిట్లకు ఇన్సూరెన్స్ సదుపాయం ఉందన్నారు. డీసీసీబీ బ్యాంకులో వ్యాపారస్తులు, ప్రజలు, పెన్షనర్లు డిపాజిట్లు చేయాలని, బ్యాంక్ వినియోగదారులకు ఏ ఇబ్బందులున్నా మేనేజర్‌ను నేరుగా కలిస్తే తక్షణమే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. బ్యాంకు సిబ్బంది వాణి, పవిత్ర, షర్మిల, పి.జయంతి, మోహనాచారి, రిటైర్డ్ మేనేజర్ గొల్లపూడి తిరుపతిరావు, ఎం.శివశంకర్, ఎస్.నాగరాజరావు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు అంటేనే మోసం, దగా, వెన్నుపోటు

- ఉదయం 10 గంటలకు సబ్ కలెక్టరేట్ ఎదుట నిరసన
- నిసార్‌అహ్మద్



మదనపల్లె రూరల్ : చంద్రబాబు అంటే మోసం, దగా, వెన్నుపోటు, అబద్ధాలే గుర్తుకు వస్తాయని వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ అన్నారు. కూటమి ప్రభుత్వం తీరును నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ పిలుపుమేరకు బుధవారం నిర్వహిస్తున్న వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. మంగళవారం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ...కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదికాలంలో ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయలేదన్నారు. ప్రజలు ఇప్పటికే చంద్రబాబుకు ఓటెందుకు వేశామా అనే ఆలోచనలో పడ్డారన్నారు. రాష్ట్రంలో ప్రజల అవసరాలు గుర్తెరిగి సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి డీబీటీ రూపంలో నేరుగా ప్రజల ఖాతాల్లో నగదు జమచేసి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చరిత్ర సృష్టించారన్నారు. చంద్రబాబు అంటే మోసం, దగా, వెన్నుపోటు, అబద్ధాలే గుర్తుకు వస్తాయన్నారు. ఎన్నికలకు ముందు చదువుకునే ప్రతి ఒక్కరికీ తల్లికి వందనం, ఆడబిడ్డ నిధి, 20లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగభృతి, ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఉచిత బస్సు ప్రయాణం తదితర అనేక హామీలు ఇచ్చి ఏ ఒక్కటీ అమలు చేయలేదన్నారు. కొత్త ఉద్యోగాలు ఇవ్వకపోగా, గత ప్రభుత్వం ఇచ్చిన వలంటీర్లు, ఎండీయూ ఆపరేటర్ల ఉద్యోగాలను తీసివేసి, యువతను నడిరోడ్డుపైకి తీసుకువచ్చి జీవనాధారం లేకుండా చేశారన్నారు. మోసం, వంచన, వెన్నుపోటు చంద్రబాబు నైజమని, 1996లో బిడ్డనిచ్చిన ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి అక్రమంగా పదవి పొందారని, 2024లో అధికారంలోకి వస్తూనే ప్రజలకు వెన్నుపోటు పొడిచారని విమర్శించారు. బుధవారం ఉదయం 10 గంటలకు చిత్తూరు బస్టాండ్ బేబీ వెల్‌కంహోం వద్ద అందరూ సమావేశమై, అనంతరం ప్రదర్శనగా వెళ్లి సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామన్నారు

వచ్చింది నేనే..సంతకం నాదే

- కాదంటే రికార్డులు, సీసీ కెమెరాలు పరిశీలించుకోండి
- వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ ముబీనా ముబషీర ఆగ్రహం


మాట్లాడుతున్న కౌన్సిలర్ ముబీనా ముబషీర, పక్కన చైర్స్‌పర్సన్ మనూజరెడ్డి, కౌన్సిలర్లు

మదనపల్లె: మే 31న జరిగిన మదనపల్లె మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశానికి హాజరైంది నేనే, హాజరు పుస్తకంతో సంతకం చేసింది నేనేనని వైఎస్సార్‌సీపీ 17వ వార్డు కౌన్సిలర్ ముబీనా ముబషీర స్పష్టం చేశారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ మనూజరెడ్డి, ఏపీఎండీసీ మాజీ చైర్‌పర్సన్ షమీం అస్లాం, కౌన్సిలర్లతో కలిసి బురాఖతో వచ్చిన ఆమె మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పచ్చ మీడియాలో వచ్చిన తప్పుడు కథనాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కౌన్సిల్ సమావేశానికి తనకు బదులుగా మరోకరు వచ్చారని, ఆమెను పట్టుకోబోతే తప్పించుకున్నట్టు నిజంలేని కథనాలు రాసేముందు వాస్తవాలు తెలుసుకోరా అని ప్రశ్నించారు. నాకు బదులు వచ్చిన బినామీ మహిళను పట్టుకునేందుకు మహిళా పోలీసుల సహాయంతో అప్పుడే ఎందుకు పట్టుకోలేదని ప్రశ్నించారు. రాజకీయ ప్రేరేపిత ఆరోపణలతో మహిళలపై ఆరోపణలు చేసేముందు నిర్ధారణ చేసుకోవాలని కోరారు. మున్సిపల్ చైర్‌పర్సన్ వి.మనూజరెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ సమావేశానికి హాజరైంది ముబీనా ముబషీరానే అని తాను స్పష్టం చేసినా తప్పుడు కథనాలు ఇచ్చారన్నారు. రాజకీయంగా బురదజల్లడం కోసం ఆభాండాలు వేయడం సమంజసం కాదన్నారు. ఏపీఎండీసీ చైర్‌పర్సన్ జీ.షమీం అస్లాం మాట్లాడుతూ కార్పొరేషన్ చైర్మన్ బంధువు పేరుతో డమ్మి కౌన్సిలర్ సంతకం పెట్టి వెళ్తున్నారని చెప్పడం చూస్తే అలాంటి ఖర్మ తమకు పట్టలేదన్నారు. వైస్‌చైర్మన్ నూర్ ఆజం, కౌన్సిలర్లు తప్పుడు కథనాలను తీవ్రంగా ఖండించారు. సమావేశంలో కౌన్సిలర్లు షబానా, ఖాజా, సుగుణ, ఫర్జానా, ముబీనా, రాజేష్, ప్రసాద్, మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి ఎస్‌ఏ.కరీముల్లా, మాజీ వైస్ చైర్మన్ ఇర్ఫాన్‌ఖాన్, రఫీ, గంగాధర్ పాల్గొన్నారు.

క్షయ రహిత సమాజం కోసం కృషి చేద్దాం


టీబీ నిర్మూలనపై వైద్య సిబ్బంది ర్యాలీ

నిమ్మనపల్లె: క్షయ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరు తమ వంతుగా కృషి చేయాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమేష్ బాబు, డాక్టర్ ప్రత్యూషలు అన్నారు. మంగళవారం ఆశా డేను పురస్కరించుకొని టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్షయ వ్యాధి లక్షణాలను ముందస్తుగా గుర్తించి అవగాహన కల్పిస్తే టీబీ వ్యాధిని అంతం చేయడం సాధ్యమవుతుందన్నారు. ప్రజల్లో ఆరోగ్యకర అలవాట్లుపై అవగాహన కల్పిస్తూ పోషకాహార లోపాలను అధిగమించాలన్నారు. మధుమేహం, హెచ్‌ఐవీ, ధూమపానం, మద్యపానం, మలేరియా, డెంగ్యూ, వంటి వ్యాప్తిపై ప్రచారం చేయాలన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు సకాలంలో టీకాలు వేయాలన్నారు. టీబీ వ్యాధిగ్రస్తుల కుటుంబ సభ్యులను, హానికర అలవాట్లున్న వారిని గుర్తించి, వ్యాధి నిర్ధారణ, తక్షణ చికిత్స కోసం అందరూ పాటుపడాలన్నారు. టిబి అంతం అందరి పంతం అన్న నినాదాలతో ర్యాలీ నిర్వహించి, టీబీ నిర్మూలనకు వైద్య ఆరోగ్య సిబ్బంది చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సిహెచ్‌ఓ, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కోవిడ్ కేసుల కోసం ప్రత్యేక సదుపాయాలు


ఆసుపత్రిలో సదుపాయాలపై ఆరాతీస్తున్న డీసీహెచ్‌ఎస్ డాక్టర్ ఆంజినేయులు

కలికిరి: కోవిడ్ వైరస్ విస్తరిస్తున్న దృష్ట్యా స్థానిక సీహెచ్‌సీలో ప్రత్యేక బెడ్‌లు, ఆక్సిజన్ సిలిండర్‌లు అందుబాటులో ఉంచుకోవాలని డీసీహెచ్‌ఎస్ డాక్టర్ ఆంజినేయులు సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ పవన్ కుమార్‌కు సూచించారు. మంగళవారం సీహెచ్‌సీని తనిఖీ చేసిన ఆయన వైద్యాధికారులతో సమావేశమై ఆసుపత్రి రికార్డులను పరిశీలించడంతో పాటు వైద్య సదుపాయాలపై సూచనలిచ్చారు. అత్యవసర వైద్య సేవకు అవసరమయ్యే మందులను నిల్వ వుంచుకోవాలని, గుండె పోటు వ్యాధికి సంబంధించిన టెనెక్ట్‌ప్లేస్ ఇంజక్షన్ నిల్వపై విచారించారు. గుండె పోటు వ్యాధికి అందుబాటులో వున్న మందును రోగులు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఆసుపతి ఆవరణలో నిర్మాణాలు పూర్తి చేసుకున్న నూతన భవనాలను పరిశీలించి సంబంధిత కాంట్రాక్టరు, అధికారులను విచారించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు ఆశాలత, అన్వేష్, సిమ్రన్, ఆశ్రిత, హెడ్‌నర్స్ ఉమామహేశ్వరి, రేడియోగ్రాఫర్ వెంకటరమణ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో అన్ని వర్గాలకు సముచిత స్థానం


కోన గ్రామంలో పదవులు పొందినవారితో సర్పంచ్ జల్లా రాజగోపాల్‌రెడ్డి, కమలాకర్‌రెడ్డి

కలకడ : వైఎస్సార్ సీపీలో పేదలు అందరికీ నవరత్నాలు, సంక్షేమపథకాలు అందించినట్లు పార్టీ పదవుల్లో కూడా అన్ని వర్గాలకు సముచిత స్థానం కల్పించినట్లు కోన సర్పంచ్ జల్లారాజగోపాల్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కమలాకర్‌రెడ్డి తెలిపారు మంగళవారం మండలంలోని కోన పంచాయతీలోని వారికి, మండలస్థాయి పార్టీ పదవులు పొందినవారిని సర్పంచ్ జల్లా రాజగోపాల్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేసి సన్మానించారు. ఇటీవల వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించి విడుదల చేసిన జాబితాలో కలకడ మండల మహిళ అధ్యక్షురాలిగా గుడిటి.సరళ, ఆర్‌టిఐ విభాగం అధ్యక్షులుగా వి.మధుసూదన్‌రెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షులుగా పి.రామాంజులు, కార్యదర్శిగా తరుగు..శివారెడ్డి, ఎక్సికిటివ్‌సభ్యులుగా యంపి బాషఖాన్‌లను ఎంపిక చేసిన విషయం తెలిసిందే.

వైఎస్సార్ సీపీ అభివృద్ధికి కృషి చేస్తాం

గ్రామస్థాయి నుంచి వైఎస్సార్ సీపీ బలోపేతానికి తమ వంతుకృషి చేస్తామని వైఎస్సార్‌సీపీలో నూతనంగా పదవులు పొందిన వారు తెలిపారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డి, పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పీలేరు నియోజకవర్గ మైనార్టీసెల్ అధ్యక్షుడు కెఎస్ మస్తాన్ అహమ్మద్, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు స్వర్ణలత, హరినాథరెడ్డి, సురేంద్రరెడ్డి, మాధవరెడ్డి, అబ్దుల్, రామ్మోహన్, మున్న, సద్దాం, ముబారక్, రంగారెడ్డి, శ్రీరాములు, నవీన్‌రెడ్డి, వరుణ్ పాల్గొన్నారు.

ఎస్టేట్‌లో అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

- ఏపీఐఐసీ జోనల్ మేనేజర్‌కు ఫిర్యాదు


ఫిర్యాదు చేస్తున్న బీవైఎస్ అధ్యక్షుడు పునీత్

మదనపల్లె రూరల్ : మదనపల్లె సీటీయం రోడ్డు ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో నియమనిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ మూర్తికి బహుజన యువసేన అధ్యక్షుడు పునీత్ ఫిర్యాదు చేశారు. మంగళవారం జోనల్ మేనేజర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించిన అనంతరం పునీత్ మీడియాతో మాట్లాడారు. సీటీఎం రోడ్డులో 36 ఎకరాల్లో ఇండస్ట్రియల్ ఎస్టేట్ ఏర్పాటైందన్నారు. స్థానికంగా యువతకు, ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వ ఆధ్వర్యంలో పరిశ్రమలను అభివృద్ధి చేసేందుకు తక్కువ ధరలో పారిశ్రామిక వేత్తలకు స్థలాలు కేటాయించారన్నారు. తమకు సబ్సిడీ ధరలో కేటాయించిన ప్రభుత్వ భూముల్లో ఏపీఐసీసీ నిబంధనలకు విరుద్ధంగా బహుళ అంతస్తుల నిర్మాణాలు చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా జోనల్ మేనేజర్ హోదాలో ఇండస్ట్రియల్ ఎస్టేట్‌ను సందర్శించి అక్రమాలపై చర్యలు తీసుకోవాలని కోరామన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం


యోగా చేస్తున్న విద్యార్థులు

మదనపల్లె సిటీ: యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని యోగా మాస్టర్ చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం స్థానిక చిత్తూరు రోడ్డులోని ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. యోగా మాస్టర్ విద్యార్థులకు యోగా ప్రాముఖ్యతను వివరించారు. యోగాను ప్రతి రోజు సాధన చేయడం ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత కూడా లభిస్తుందన్నారు. కార్యక్రమంలో కాలేజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి, ప్రిన్సిపాల్ సతీష్ బాబు, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ అరుణ్‌కుమార్‌రెడ్డి, కాలేజీ డీన్స్, అధ్యాపకులు పాల్గొన్నారు.

కలకడ : యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఎంపీడీఓ అబ్దుల్‌రహీం, ఎస్ఐ రామాంజనేయులు అన్నారు. మంగళవారం కలకడ సీఐ కార్యాలయం సమీపంలో పంచాయతీ కార్మికులు, ఉద్యోగస్తులతో కలిసి యోగాసనాలు వేయించారు. యోగా ప్రయోజనాలను తెలియజేశారు. మనిషి శరీరంలోని అవయవాలకు వ్యాయామం యోగా వలన లభిస్తుందని గుర్తు చేశారు. 21రోజులు పాటు నిర్వహించే కార్యక్రమంలో అందరు తప్పక పాల్గొన్నారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం


వివాహ వేడుకలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి

ములకలచెరువు: పుంగనూరు నియోజకవర్గం ఈడిగపల్లెకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు కె. ప్రసాద్‌రెడ్డి కుమారుడు మోహన్‌రెడ్డి – శిరీషాల వివాహ వేడుకల్లో మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి , రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి పాల్గొన్నారు. ములకలచెరువు కేజీయన్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన వివాహ వేడుకల్లో హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. పెళ్లికి హాజరైన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రతి ఒక్కరినీ ఆత్మీయంగా పలకరించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మాదవరెడ్డి, మోహన్‌రెడ్డి, వై. రవిశేఖర్‌రెడ్డి, కుల్‌దీప్‌రెడ్డి, ఫకృద్దీన్, విశ్వనాథ్, అన్సర్‌బాషా, మంజునాథ్, ప్రతాప్ పాల్గొన్నారు.

వేరుశనగ విత్తన శుద్ధిపై అవగాహన

ములకలచెరువు: మండలంలోని కదిరినాథునికోటలో మంగళవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతుల కోసం వికసిత్ కృషి సంకల్ప్ అభిమాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విస్తరణ శాస్త్రవేత్త కె. మాధురి వేరుశనగ విత్తన శుద్ధి ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. సేద్యవిభాగ శాస్త్రవేత్త సోమశేఖర్‌బాబు మాట్లాడుతూ వేరుశనగ, వరిలో నూతన వంగడాలు, సాగుపద్ధతిపై తెలిపారు. ఏఓ లీలాకుమారీ మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు అందిస్తున్న పథకాలపై వివరించారు. కార్యక్రమంలో రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యంతోనే జేఎల్‌ఎంకు విద్యుత్ ప్రమాదం

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ

మదనపల్లె రూరల్ : విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే పీటీఎం మండలం జేఎల్‌ఎం బాలకృష్ణకు విద్యుత్ ప్రమాదం జరిగి తీవ్రంగా గాయపడ్డాడని ఏపీ గ్రామ,వార్డు సచివాలయ ఎనర్జీ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షులు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ డిమాండ్ చేశారు. జేఎల్‌ఎం బాలకృష్ణకు జరిగిన విద్యుత్ ప్రమాదంపై ఈఈ సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈఈ కార్యాలయం ఎదుట జేఎల్‌ఎంలు, ఏఐటీయూసీ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సాంబశివ మాట్లాడుతూ..జేఎల్‌ఎంలు 33కే.వీ.11కే.వీ. విద్యుత్ పోల్స్ ఎక్కకూడదనే నిబంధనలు ఉన్నప్పటికీ బలవంతంగా ఎక్కించి ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. విద్యుత్ సరఫరా ఉన్న పోల్ ఎక్కడం వల్లే జేఎల్ ఎం బాలకృష్ణ విద్యుత్ ప్రమాదానికి గురై బెంగళూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడన్నారు. అతడికి మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకుని, బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు. లేనిపక్షంలో సచివాలయ ఎనర్జీ ఎంప్లాయిస్ అసోసియేషన్, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జిల్లా ఎస్‌ఈ కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, ముక్తియార్, కరుణాకర్, వినోద్‌కుమార్, రామమోహన్‌నాయక్, ప్రవీణ్‌నాయక్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

దివ్యాంగ పిల్లలపై సర్వే

మదనపల్లె సిటీ: బడికి వెళ్లని, మధ్యలో బడి మానేసిన దివ్యాంగ పిల్లలపై సమగ్రశిక్ష ఆధ్వర్యంలో భవిత కేంద్రం సహిత విద్య ఉపాధ్యాయులు సర్వే నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మదనపల్లె పట్టణం, రూరల్ పరిధిలో 25 మంది పిల్లలను గుర్తించినట్లు ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. వీరిని సమీపంలోని భవిత కేంద్రంలో చేర్పించడం జరిగిందన్నారు. సహిత విద్య ఉపాధ్యాయులు అమినేని నాగేంద్ర, ఎన్.రెడ్డమ్మలు సమగ్ర సర్వే నిర్వహించారు. భవిత కేంద్రం అందించే సేవలు గురించి వివరించారు.

పల్లకీలో లక్ష్మీనరసింహస్వామి

కలికిరి: పట్టణంలో వెలసిన శ్రీలక్ష్మీ నరసింహ స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా రెండవ రోజు మంగళవారం రాత్రి సతీసమేతంగా లక్ష్మీనరసింహస్వామి పల్లకీపై మేళతాలాలు, మంగళవాయిద్యాల నడుమ పుర వీధులలో విహరించారు. ఈ సందర్భంగా భక్తులు ఇంటింటా స్వామి వారికి కొబ్బరికాయలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం స్వామి వారికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం శాస్త్రోక్తంగా ధ్వజారోహణం నిర్వహించి ఉత్సవాలను ప్రారంభించారు. ఆలయంలో భక్తులకు తీర్థప్రసాదాల వినియోగం చేశారు. ఆలయ అర్చకులు మురళీధరాచార్యులు, రాముస్వామి, శ్రీకాంత్‌స్వాతి తదితరులు పాల్గొన్నారు.

మేడికుర్తిలో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్

కలికిరి: మండలంలోని మేడికుర్తి గ్రామంలో కేవీకే ఆధ్వర్యంలో మంగళవారం వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీకే కో–ఆర్డినేటర్ డా. మంజుల ఎరువుల వినియోగం, విత్తన శుద్ధి, భూసార పరీక్ష ప్రాముఖ్యత తదితరాలపై రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ, ఉద్యానశాఖ, పశువైద్య శాఖల నుంచి హాజరైన అధికారులు ఆయా శాఖల ఆధ్వర్యంలో రైతులకు అందుబాటులో ఉన్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఓ మమతారెడ్డి, హెచ్‌ఓ సుకుమార్‌రెడ్డి, ఉద్యాన యూనివర్సిటీ అధికారి డా. రాజా నాయక్, ఆత్మ బీటీఎం అమృత్‌కుమార్, కేవీకే పశువైద్య శాస్త్రవేత్త నవీన తదితరులు పాల్గొన్నారు.

పది మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

కేవీపల్లె : పది మంది పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ. 42,140 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ చిన్నరెడ్డెప్ప తెలిపారు. వివరాలిలావున్నాయి. మండలంలోని నూతనకాల్వ సమీపంలో మంగళవారం మామిడి తోటలో పేకాట ఆడుతున్నట్లు అందిన సమాచారంతో పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో పది మంది నిందితులను అరెస్ట్ చేసి వారి వద్ద నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చదువుకున్న పాఠశాలలో హెచ్‌ఎంగా బాధ్యతలు


హెచ్‌ఎం వేమనారి

పెద్దతిప్పసముద్రం: విద్యా బుద్ధులు నేర్చుకున్న పాఠశాలకే తాను హెచ్‌ఎంగా రావడం సంతోషంగా ఉందని తెలుగు జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం వేమనారి అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ హెచ్‌ఎంల బదిలీల్లో భాగంగా ఇప్పటి వరు కుప్పం మండలంలో పని చేస్తూ ఇక్కడ బాధ్యతలు చేపట్టడం తనకు గర్వంగా ఉందన్నారు. పాఠశాలను బలోపేతం చేయడమేగాక స్కూల్ సిబ్బంది సహకారంతో విద్యాభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు.

వెన్నుపోటు దినం పోస్టర్ల ఆవిష్కరణ

తంబళ్లపల్లె: నియోజకవర్గంలోని ములకలచెరువు మండలం కేంద్రం రైల్వే స్టేషన్ సర్కిల్‌లో బుధవారం ఉదయం 10 గంటలకు వైఎస్సార్ సీపీ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల పార్టీ కన్వీనర్ చౌడేశ్వర్, సర్పంచుల సంఘం అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు కోరారు. మంగళవారం తంబళ్లపల్లెలో వెన్నుపోటు దినం ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్ ఎంపీపీ కరీమ్, నాయకులు నారాయణ రెడ్డి, మల్‌రెడ్డి, రాజారెడ్డి,రమణారెడ్డి, రామమూర్తి, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలి

నిమ్మనపల్లె: ప్రభుత్వ పాఠశాలలలో అమలు చేస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా విద్యార్థులకు అందించే భోజనంలో నాణ్యత పాటించాలని ఎంఈఓ నారాయణ అన్నారు. మంగళవారం స్థానిక ఎమ్మార్సీ భవనంలో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లోని మధ్యాహ్న భోజన పథక నిర్వాహకులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ నారాయణ మాట్లాడుతూ మధ్యాహ్న భోజన నిర్వాహకులు మెనూ ప్రకారం విద్యార్థులకు రుచికరంగా, నాణ్యతగా భోజనాన్ని అందించాలని ఆదేశించారు. అనంతరం నిర్వాహకులు తయారుచేసిన భోజనాల రుచులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఆర్సీసి సిబ్బంది, ఎంఐఎస్ కోఆర్డినేటర్ నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.